## క్లుప్తంగా

### మత సామరస్యం




అయ్యప్ప స్వాములకు భిక్ష వడ్డిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: స్థానిక బిస్మిల్లా డాబా యజమాని హుశేన్‌బాషా సోదరులు మత సామరస్యాన్ని చాటుకున్నారు. బుధవారం కొలిమిగుండ్ల, మీర్జాపురం గ్రామాలకు చెందిన 70 మందికి పైగానే అయ్యప్ప మాలధారులకు బిక్ష ఏర్పాటు చేశారు. కుల,మతాలకు అతీతంగా ముస్లిం సోదరులు స్వయంగా అయ్యప్ప స్వాములకు బిక్ష వడ్డించారు. హుశేన్‌బాషా ముస్లిం సోదరులను అయ్యప్ప స్వాములను అభినందించారు.

### అయ్యప్ప మాలధారులకు అన్నదానం

బేతంచెర్ల: స్థానిక నంద్యాల రహదారిలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మాలధారులకు (అన్నదానం) భిక్ష కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ముందుగా అయ్యప్ప స్వామికి అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వినాయక, సుబ్రమణ్యేశ్వర, అయ్యప్ప స్వామి, మాలిక పురోత్తమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి సభ్యులు మాలధారులకు భిక్షను ప్రారంభించారు. దీక్ష కాలం ముగిసే వరకు భిక్ష కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అయ్యప్ప సేవా సమితి సభ్యులు బచ్చు సుబ్రమణ్యం, నాగేశ్వర్‌రెడ్డి, సాయి కృష్ణ, డక్కి శేఖర్ పాల్గొన్నారు.

### మాజీ సర్పంచ్ మృతి



బొల్లవరం వెంకటేశ్వర్ రెడ్డి

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురం గ్రామ సర్పంచ్ బొల్లవరం ప్రమీలమ్మ భర్త మాజీ సర్పంచ్, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు బొల్లవరం పెద్ద వెంకటేశ్వర్‌రెడ్డి (65) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక బుధవారం మరణించారు. ఆయన మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు. ఆయన 1988 నుంచి 1993 వరకు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై గ్రామ అభివృద్ధికి కృషి చేశారని, ఆయన సేవలను కొనియాడారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, రామచంద్రుడు ఆ గ్రామినికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు.

### ప్రజా సమస్యలను పరిష్కరించండి



ఆర్‌ఎస్ రంగాపురంలో జీపు జాతా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

బేతంచెర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు, కార్మిక, ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో సీఐటీయూ మండల నాయకులు రహంతుల్లా అధ్యక్షతన ఆటో జాతా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మారుస్తూ తెచ్చిన విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు లాభాలు చేకూర్చేలా మోడీ ప్రభుత్వం పనిచేస్తోందని, కార్మికులు, రైతుల పక్షాన పనిచేయడం లేదని విమర్శించారు.

### 24న ఉచిత వైద్య శిబిరం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో పెద్దిరెడ్డి చారిటిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గురురాఘవేంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకుడు పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు 50వ ఉచిత శిబిరం కరపత్రాలను బుధవారం ఆయన విడుదల చేశారు. ప్రతి నెలా చివరి ఆదివారం మంగపల్లె గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. రోగులకు ఆరోగ్య పరీక్షలతోపాటు ఉచిత మందులు అందజేస్తామని, భోజనం వసతి కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి ట్రస్ట్ డైరెక్టర్స్ మౌలాలి రెడ్డి,షేక్షావలి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 23న చిన్న పిల్లలకు ఉచిత వైద్య శిబిరం

బనగానపల్లె: రెడ్‌క్రాస్, శ్రీకాత్యాయణి మెడికల్ అండ్ సర్జికల్ స్టోర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23న చిన్న పిల్లలకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు రెడ్‌క్రాస్ సోసైటీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్‌బాషా, సబ్ బ్రాంచ్ కన్వీనర్ పైపుల్లా తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న కాత్యాయణి మెడికల్ అండ్ సర్జికల్ స్టోర్ ఆవరణలో నిర్వహించే వైద్య శిబిరంలో డాక్టర్ పీఎస్ ఆనంద్ చిన్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తారన్నారు. అదేవిధంగా రూ.650ల విలువ ఎంఎంఆర్ ఉచిత టీకా వేస్తారని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త
- రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగు నీరు
- విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



నిరుపయోగంగా చెత్త తరలింపు రిక్షా



యు.కొత్తపల్లి వద్ద పేరుకుపోయిన చెత్త



డ్రైనేజీ లేక రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు నీరు

డోన్ రూరల్: పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. కొద్దిపాటి వర్షానికే రోడ్లంతా బురదమయంగా మారి అడుగుతీసి అడుగువేసే పరిస్థితి లేదు. మురుగు రోడ్లపైనే పారుతోంది. ఎక్కడి చెత్త అక్కడే ఉంది. రోజుల తరబడి చెత్తను తరలించడం లేదు. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నా నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పూడికతో నిండిన డ్రెయిన్లు**

గ్రామాల్లోని డ్రైనేజీలు చెత్తచెదారంతో నిండిపోయి పూడిక ఏర్పడ్డాయి. దీంతో కాలువల్లో మురుగు నీరు ముందుకు పారడం లేదు. మురుగు నీరంతా నిల్వ ఏర్పడి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య లోపంతో ఈగలు, దోమలు ప్రబలుతున్నాయి. దీంతో రాత్రి సమయాలలో ప్రజలకు కంటికి కనుకు కుండా పోతోంది.

**అధ్వానంగా పారిశుద్ధ్యం**

మండలంలో 31 పంచాయితీలలో 43 గ్రామాలు ఉన్నాయి. గత కొంతకాలంగా గ్రామాలలో ఎక్కడా పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు. వీధుల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, గృహాల మధ్య పేరుకుపోయిన చెత్త చెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు గ్రామాల్లో వినిపిస్తున్నాయి. మండలంలోని ఆవులదొడ్డి, గోసానిపల్లి, కొచ్చెర్వు, మల్యాల, ఎద్దుపెంట, సీసంగుంతల, యు.కొత్తపల్లి, అనుంపల్లి, వెంకటనాయునిపల్లి, కనపకుంట, తిమ్మాపురం తదితర గ్రామాలు పారిశుద్ధ్య లోపంతో అధ్వానంగా తయారయ్యాయి. సైడు కాలువలు లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నీరంతా రోడ్లపైకి చేరుతుంది. వర్షపు నీరు కూడా రోడ్ల మీదకు వచ్చి చేరుతుండటంతో రోడ్లన్నీ పంట కాలువలను తపిస్తున్నాయి. మురుగు కాలువలు పూడిపోయి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మురుగు, చెత్త దొమల సంతతికి నెలవుగా మారుతుంది. దీంతో గ్రామాలలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

**ఎటు చూసినా అపరిశుభ్రతే**



మా గ్రామంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత దర్శమిస్తోంది. డ్రైనేజీలు, పూడిపోయి మురుగు నీరు ముందుకు పారడం లేదు. మురుగు నీటితో రోడ్లు ఆధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షం వచ్చినా మూడు నాలుగు రోజుల పాటు నడిచేందుకు వీలుండదు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులు, నాయకులు గ్రామాలవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.

– రామ్‌కుమార్‌యాదవ్, వెంకటనాయునిపల్లి గ్రామం

**రోడ్లపైనే మురుగు**



మా గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కాలువలలో పూడిక ఏర్పడి మురుగు రోడ్ల పైకి వస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది, ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలను పట్టించుకోవడం లేదు.

– మధు, తిమ్మాపురం గ్రామం

### వీఓఏలపై వేధింపులు ఆపాలి

డోన్ టౌన్: వీఓఏలపై కూటమి నాయకుల ఒత్తిళ్లతో సిబ్బంది వేధింపులకు గురిచేస్తుండటం వల్ల తీవ్ర నిరాశతో ఆత్మహత్యలు, మరణాలు చోటు చేసుకుంటున్నాయని, వీటిని వెంటనే ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెబాట పడతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరాం, డోన్ మండల వీఓఏల సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి గుండాలయ్యగౌడ్ స్పష్టం చేశారు. వీఓఏల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యాక్రమానికి డోన్ నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయ, అధికారుల వేధింపులు అధికం అయ్యాయన్నారు. వేధింపుల కారణంగా కొత్తబురుజు వీఓఏ వెంకట్రామిరెడ్డి గుండెపోటుతో మరణించారని, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని, ఇందుకు బాధ్యులైన ఏపీఎం మల్లికార్జున, సీసీ ఈశ్వరమ్మను సస్పెండ్ చేయాలని కోరారు. అలాగే తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, రూ.26 వేల వేతనం చెల్లించాలని తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ధర్నాలో పాల్గొనేందుకు దాదాపు 50 మంది నంద్యాలకు తరలివెళ్లారు.

### నాటుసారా స్వాధీనం

బనగానపల్లె రూరల్ : కొలిమిగుండ్ల మండలం తిమ్మానాయునిపేట గ్రామానికి చెందిన వెంకటరాముడు అనే వ్యక్తిని నాటుసారా కేసులో అరెస్టు చేసినట్లు నంద్యాల ఈఎస్‌టీఎఫ్ స్క్వాడ సీఐ లక్ష్మణ్ దాస్ బుధవారం తెలిపారు. నిందుతుడు మోటర్ సైకిల్ పై 120 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా అరెస్టు చేశామన్నారు. నాటుసారాతోపాటు మోటార్ సైకిల్‌ను సీజ్ చేశామన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప విళక్కి పూజ



గ్రామోత్సవంలో కేరళ బృంద శింగారి మేళతాళాలు



భద్రకాళీ వేషధారణలో కళాకారులు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన హరిహర అయ్యప్ప స్వామి దేవాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బుధవారం విళక్కిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అఖండ దీప స్థాపనం, అంకురార్పణ, అష్టాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహంతో పురవీధుల గుండా గ్రామోత్సవం వైభవంగా సాగింది. కేరళ బృందం శింగారి మేళ తాళాలతో ఊరేగింపు కార్యక్రమం జరిగింది. భద్రకాళీ వేషధారణ ఆకట్టుకుంది. అయ్యప్ప, శివమాలాధారణ భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: వివిధ కారణాలతో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు సబ్‌జైలులో సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్ తంగమణి సూచించారు. పట్టణంలోని సబ్ జైలును ఆమె బుధవారం తనిఖీ చేశారు. జైలు పరిసరాలు, బ్యారక్‌లు, వంటశాలను పరిశీలించి ఆహార పదార్థాలను రుచి చూశారు. అనంతరం ఖైదీలతో సమావేశమై వారి వివరాలు తెలుసుకుంటూ బెయిల్‌కు దరఖాస్తు విషయాలపై చర్చించారు. బెయిల్ కోసం న్యాయవాదిని నియమించుకోలేని వారికి ప్రభుత్వం తరపున ఉచిత న్యాయ సేవలు అందిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆహార, భోజన వసతులతో పాటు వైద్య సదుపాయలు, డాక్టర్ సేవలపై ఆరా తీసి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సబ్ జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, న్యాయవాధి మధుసూదన్, కోర్టు సిబ్బంది కల్యాణి తదితరులు ఉన్నారు.

### అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

బేతంచెర్ల: దేశ ప్రధాని నరేంద్రమోదీ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ జనరంజక పాలన అందిస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమ సుందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వికాస నిలయంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్ రెడ్డి, డోన్ నియోజకవర్గ కన్వీనర్ సందు రమణ, మండలాధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మండలంలో బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

### నేరాలను నియంత్రించాలి



రికార్డులను పరిశీలిస్తున్న రైల్వే డీఎస్పీ హర్షిత

డోన్ రూరల్: రైల్వే పోలీసులు నేరాల నియంత్రణకు కృషి చేయాలని రైల్వే డీఎస్పీ హర్షిత సూచించారు. స్థానిక రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఔట్ పోస్టను బుధవారం డీఎస్పీ పరిశీలించారు. నేరాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం రైల్వే పోలీసులతో మాట్లాడుతూ.. సిబ్బంది కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నేరాలు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టకూడదన్నారు. విధుల్లో ఉన్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైల్వే సీఐ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఐ బిందుమాధవి, సిబ్బంది ఉన్నారు.

### పాఠశాలకు బీరువాల విరాళం



దాతలకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్యాపిలి: డోన్ పట్టణానికి చెందిన స్ఫూర్తి సేవా సమితి సభ్యులు దాతల సహకారంతో బుధవారం చిన్నపొదిళ్ల ఉన్నత పాఠశాలకు రెండు బీరువాలను విరాళంగా ఇచ్చారు. డోన్‌కు చెందిన న్యూ నబి ఎంటర్‌ప్రైజెస్ అధినేత ఆలంకొండ మాబు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఒక బీరువాను, డోన్ ఆర్టీసీ ఉద్యోగిని శాంతమ్మ ఒక బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు హెచ్‌ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. స్ఫూర్తి సేవా సమితి సభ్యులు మధు, భాస్కర్ రెడ్డి, నారాయణ స్వామి, పెద్దన్న తదితరులు ఉన్నారు.

## పాఠశాలల పనివేళలు పెంచడం సరికాదు



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పాఠశాలల పనివేళలను పెంచాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం సాయంత్రం జిల్లా స్వర్ణోత్సవ మహాసభలకు సంబంధించిన కరపత్రాల విడుదల కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 24వ తేదీ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్వర్ణోత్సవ మహాసభలకు ఉపాధ్యాయులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, డోన్ మండల అధ్యక్షులు లక్ష్మీనాయక్, ప్రధాన కార్యదర్శి గోపాల్, ప్యాపిలి మండలాధ్యక్షులు రమేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

## మండిలో రూ.6 సొంతంగా అమ్ముకుంటే రూ.40

- మిర్చి దిగుబడులను వీధివీధికి తిరుగుతూ విక్రయిస్తున్న రైతు దంపతులు



కోవెలకుంట్ల పంచాయతీ సర్కిల్‌లో పచ్చిమిర్చిని విక్రయిస్తున్న రైతు దంపతులు

కోవెలకుంట్ల: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసి విత్తనం మొదలుకుని పంట ఉత్పత్తుల విక్రయం వరకు అన్నదాతకు అండగా నిలిచింది. కూటమి సర్కార్ రైతు సంక్షేమాన్ని విస్మరించడంతో కర్షకులు రోడ్డున పడ్డారు. రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాది రూ. 20 వేలు అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ పెట్టుబడి సాయం అటుంచితే పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం బొమ్మేపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి తనకున్న రెండు ఎకరాల సొంత పొలంతోపాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు (ఎకరానికి రూ.20 వేలు చొప్పున) తీసుకుని ఈ ఏడాది పచ్చిమిర్చి (తెంపుడు కాయ) సాగు చేశాడు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ, కోత తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.1.50 లక్షల వరకు వెచ్చించాడు. ప్రస్తుతం పైరు చేతికంది పచ్చిమిర్చి కోతలు సాగుతున్నాయి. మండిలో విక్రయించేందుకు వెళ్తే కిలో రూ. 6 ధర పలుకుతుండటంతో పెట్టుబడులు కూడా రావని భావించాడు. స్వయంగా దిగుబడులను అమ్మేందుకు రైతు దంపతులు రోడ్డెక్కారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను రోజుకు రూ. 5 వేలకు మాట్లాడుకుని (డీజిల్ ఖర్చు లేకుండా) బాడుగకు తీసుకున్నాడు. భార్య లక్ష్మీదేవితో ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ప్రాంతాల్లో కిలోల చొప్పున పచ్చిమిర్చిని ప్రజలకు విక్రయిస్తున్నారు. కిలో రూ.40 చొప్పున, 50 కిలోల బస్తా రూ.1,600 చొప్పున అమ్ముతున్నారు. మండిలో కిలో రూ.20 ధర పలికితే రోడ్లపై పచ్చిమిర్చి అమ్మాల్సిన పరిస్థితులు వచ్చేవి కాదని రైతు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### 24న బౌద్ధ దీక్ష మహోత్సవం

కోవెలకుంట్ల: ఒంగోలు పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న బౌద్ధ ధమ్మదీక్ష మహోత్సవానికి తరలిరావాలని బీఎస్ఐ(బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా) జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లె ఓబయ్య పిలుపునిచ్చారు. కోవెలకుంట్లలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఎస్ఐ ఒంగోలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 68వ ధమ్మదీక్ష కొనసాగుతుందన్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, బౌద్ధబిక్షులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

### పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో బుధవారం పిచ్చికుక్క దాడిలో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. ప్రధాన రహదారిలో వెంకట గగన్‌తో పాటు చింతలాయిపల్లె రోడ్డులో ఉన్న మరొక చిన్నారిని పిచ్చి కుక్క కరవడంతో గాయపడ్డారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం తాడిపత్రికి తీసుకెళ్లారు. పిచ్చికు క్క వీధుల్లో సంచరిస్తుండటంతో గ్రామస్తులు భయబ్రాంతులకు గురవుతున్నారు.

### విద్యార్థుల సంఖ్య పెంచాలి



హాజరు పట్టిని పరిశీలిస్తున్న డీఈఓ జనార్ధన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్:ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని యనకండ్ల గ్రామం ఎంపీయూపీ, ఎస్సీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలను డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉన్న విద్యార్థులు సంఖ్యను పరిశీలించారు. ఖాళీ పోస్టుల వివరాలను హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. మన బడి నాడు–నేడు కింద జరిగిన పనులు పెండింగ్ వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ రామకృష్ణయ్య, హెచ్‌ఎంలు నరసయ్య, శంకర్‌రావు, సీఆర్‌పీ చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసిన దృశ్యం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర రెడ్డి



విద్యార్థినికి బహుమతులు అందజేస్తున్న దృశ్యం



బేతంచెర్లలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమైన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిసిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ ఆవరణలోని గాడిచెర్ల హరిసర్వోత్తమరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లైబ్రేరియన్ బాలతిమ్మారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు వెంకటస్వామి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు సుధీర్, తిరుపతిరెడ్డి, రిటైర్డ్ టీచర్ బాబుసాహెబ్, టైలర్ అసోసియేషన్ అధ్యక్షుడు అహమ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అవుకు: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని ఎంఈఓ వెంకటేశ్వర రెడ్డి సూచించారు. గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి.ఈ సందర్భంగా ఎంఈఓ గ్రంథాలయాల ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం వ్యాస రచన, చిత్రలేఖనం, క్విజ్, పరుగుపందెల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసులు, గ్రంథాలయ ఇన్‌చార్జ్ రామదాసు, ఉపాధ్యాయురాలు కుమారి తదితరులు పాల్గొన్నారు.

సంజామల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ మేరకు వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను గ్రంథాలయ అధికారి తిమ్మరెడ్డి, హెచ్‌ఎం సురేష్ రెడ్డి అందజేశారు. పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఈ సందర్భంగా వారు విద్యార్థులకు సూచించారు.

**గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి**

బేతంచెర్ల: ప్రతి విద్యార్థి మేధా సంపన్నుడు కావాలంటే గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనం చేయడం వల్లనే సాధ్యమవుతుందని స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అబ్రహం పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గ్రంథాలయ అధికారి మధుశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన, ఆటల పోటీలు, ముగ్గుల పోటీల్లో ప్రతిభ చాటిన వారికి స్థానిక గ్రంథాలయంలో ముగింపు వారోత్సవాల సందర్భంగా బుధవారం బహుమతుల ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ.. ఎందరో మేధావులుగా రాణించడానికి నాటి నుంచి నేటి వరకు గ్రంథాలయాల పాత్ర ఎంతైనా ఉందన్నారు. గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**విజ్ఞానం పెంచుకోవాలి**

ప్యాపిలి: విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక కళాశాలలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తకాలను చదివేకొద్దీ విజ్ఞానవంతులు అవుతారన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. లైబ్రరీ లెక్చరర్ రామకృష్ణయ్య, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నవీనపాటి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



సమావేశంలోమాట్లాడుతున్న నరసింహారెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలో ఎన్‌ఆర్‌జీఎస్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని డోన్ డివిజన్ డీఎల్‌డీఓ, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఏపీడీ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక పొదుపు భవనంలో ఎన్‌ఆర్‌జీఎస్ పనులపై నిర్వహించిన రివ్యూలో ఆయన మాట్లాడారు. మండలానికి పశువుల షెడ్లు 50 కేటాయించడం జరిగిందని, మార్చి చివరలోపు నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉంచేందుకు నిర్మిస్తున్న ఇంకుడు గుంతల నిర్మాణాల టార్గెట్‌ను కూడ పూర్తి చేసి ఉపాధి పనుల్లో లేబర్ బడ్జెట్‌ను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఓ రేష్మా, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పొలం విషయంలో ఘర్షణ

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామంలో పొలం భాగ పరిష్కారాల్లో భాగంగా గొడవ పెట్టుకొని కురువ శ్రీనివాసులు, భార్య శేషమ్మపై అన్న తిరుమలేష్, భార్య మద్దమ్మ, తమ్ముడు వెంకటస్వామి, సాలమ్మ దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య బుధవారం రాత్రి తెలిపారు.